క్లుప్తంగా

గండేపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ



గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లిలో పాస్టర్ కొండా స్టాలిన్ ఆధ్వర్యంలో సీఎస్ఐ చర్చి కమిటీ సభ్యులు, స్త్రీల మైత్రీ సభ్యులు గురువారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు.ఈసందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి క్రీస్తు జన్మ వృత్తాంతం తెలియజేసేందుకు క్యాండిల్ సర్వీస్ నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రతి గడప వద్ద క్యాండిల్‌ను వెలిగించి క్రీస్తు పుట్టుకకు సూచిక ఈ వెలుతురు అని వివరించినట్లు తెలిపారు. సంఘ నాయకుడు బొక్కా రవికుమార్, బొక్కా రాబర్ట్, మార్కపూడి లాజరు, మార్కపూడి మధుబాబు, కీసర వెంకట్, స్త్రీల మైత్రీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామకార్యదర్శులతో సమీక్ష

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామాల్లో కుక్కల నియంత్రణపై సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు ప్రత్యేక ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీవో జి.నితిన్ ఆదేశించారు. తన కార్యాలయంలో మండలంలోని గ్రామ పంచాయతీ, సచివాలయ కార్యదర్శులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కుక్కలు స్త్వైరవిహారం చేస్తూ గాయపరుస్తున్నాయంటూ ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ఏ ప్రాంతంలో ఎక్కువగా వీధి కుక్కలు సంచరిస్తున్నాయో గమనించి వాటిని నిర్మూలించాలా? లేక పట్టుకొని అడవుల్లో వదిలేయాలా? అని గ్రామస్తుల నుంచి సలహాలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం టాంటాం కూడా వేయించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం నిర్మూలనకు చర్యలు తీసుకోవడమే కాకుండా తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించాని ఆదేశించారు. గ్రామాల్లో వీధిదీపాల నిర్వహణ కూడా అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఆయా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శులు జగ్గయ్య, శివాజీ, శ్రావణ్, సంక్రాంత్, రంగారావు, ఇమామ్‌సాహెబ్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించడం తగదు

నందిగామ టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అవమానించేలా మాట్లాడటం బాధాకరమని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంట్ సాక్షిగా అమిత్‌షా, అంబేడ్కర్‌ను అవమానించడం హేయమైన చర్యన్నారు. అమిత్ షా వ్యాఖ్యలను బీఎస్పీ తీవ్రంగా ఖండిస్తోందని, ఆయన తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ప్రధాన వీధుల్లో ఆక్రమణల తొలగింపు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో రోజురోజుకు పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యపై పోలీసులు చర్యలు చేపట్టారు. సీఐ పి.వెంకటేశ్వర్లు గురువారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల సహకారంతో రోడ్డుకు అడ్డుగా ఉన్న తోపుడు బండ్లు, బ్యానర్ల తొలగింపు పనులు చేపట్టారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రోడ్లపై అమ్మకాలు చేస్తున్న చిరువ్యాపారులు కూడా సహకరించాలని సీఐ వెంకటేశ్వర్లు కోరారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ జి.రాజు, ట్రాఫిక్ ఎస్ఐ ఆర్.శ్రీనివాస్, మున్సిపల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జీతాలు విడుదల చేయాలి



కంచికచర్ల: ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలని, సోషల్ వెల్ఫేర్ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు అక్టోబర్, నవంబర్ నెలల జీతాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీఆర్టీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సోల రాఘవరాజు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని గనిఆత్కూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి 30శాతాన్ని జూలై 2023 నుంచి ఇవ్వాలన్నారు. పొదుపు చేసుకున్న పీఎఫ్, ఏపీ జీఎల్ఐ నగదును ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. ప్రతి మండలంలో ప్లస్2 పాఠశాలల్లో ఇంటర్మీడియట్ కోర్సును కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షులు డబ్బూరి సాంబశివరావు, వేముల క్రిష్టాఫర్, నాయకులు బలుసుపాటి మల్లికార్జునరావు, ఏఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అద్దె బకాయిలు రూ.29లక్షలు పెండింగ్

- అంగనవాడీ భవనాలకు అద్దె చెల్లింపు నిలుపుదల
- ఏడునెలలుగా నిలిచిన అద్దె బకాయిలు
- ఖాళీ చేయాలంటున్న ఇంటి యజమానులు
- ఆందోళనలో అంగన్‌వాడీలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- ప్రభుత్వ తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు



జగ్గయ్యపేట మండలం చిల్లకల్లులో అద్దె భవనంలో కొనసాగుతున్న ఓ అంగనవాడీ కేంద్రం

జగ్గయ్యపేట: అంగనవాడీ అద్దె భవనాలకు ప్రభుత్వం ఏడునెలలుగా అద్దెలు చెల్లించకపోవడంతో ఆయా భవనాలను ఖాళీచేయాలంటూ ఇంటి యజమానులు అంగనవాడీ కార్యకర్తలను ఒత్తిడి చేస్తున్నారు. దీంతో భవన యజమానులకు సమాధానం చెప్పుకోలేక అంగన్‌వాడీ కార్యకర్తలు అవస్థలుపడుతున్నారు. అద్దె చెల్లింపులు ఇంకా ఆలస్యమైతే యజమానుల నుంచి ఒత్తిడి మరింత పెరుగుతుందని వారు ఆందోళన చెందుతున్నారు.

అద్దెభవనాల్లో 119 కేంద్రాలు..

నియోజకవర్గంలోని చిల్లకల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పేట పట్టణంతోపాటు జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాలు ఉన్నాయి. జగ్గయ్యపేట పట్టణంలో 46 అంగన్‌వాడీ కేంద్రాలు, మండలంలో 87, వత్సవాయిలో 80, పెనుగంచిప్రోలు మండలంలో 54 కేంద్రాలు కలిపి నియోజకవర్గంలో మొత్తం 267 అంగనవాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 119 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఈ భవనాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పట్టణంలో ఇల్లు అద్దెకు తీసుకుంటే చదరపు అడుగుకు రూ.6 చొప్పున గ్రామాల్లో అయితే రూ.1.50ల చొప్పున అద్దె చెల్లిస్తారు. రెండేళ్ల కిందట పెరిగిన ధరలకనుగుణంగా అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పట్టణాల్లోని అంగన్‌వాడీ కేంద్రానికి అద్దెగా నెలకు రూ.6వేలు, గ్రామాల్లో రూ.2వేలు చొప్పున చెల్లించాలని నిర్ణయించింది. ఆమేరకు చెల్లింపులు చేసింది.

ఏడునెలలుగా అద్దె నిలిపివేత....

ప్రాజెక్టు పరిధిలోని 119 అద్దె భవనాలకు ఈ ఏడాది మే నెల నుంచి నవంబర్ వరకు ప్రభుత్వం అద్దె చెల్లింపులు చేయలేదు. దీంతో ఆయా యజమానులు ఆయా భవనాలను ఖాళీ చేయాలంటూ అంగన్‌వాడీ సిబ్బందిపై ఒత్తిడి చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో యజమానుల ఒత్తిడి తట్టుకోలేక అంగన్‌వాడీ కార్యకర్తలే ఒకటిరెండునెలల అద్దె చెల్లిస్తూ కేంద్రాలు నడుపుతున్నట్లు సమాచారం. అద్దె చెల్లించకపోతే కేంద్రాన్ని ఖాళీ చేయాల్సిందేనని యజమానులు ఖరాఖండీగా చెబుతుండటంతో చేసేదేమిలేక అప్పులు చేసి మరీ ఎంతోకొంత అద్దె చెల్లిస్తున్నారు.

రూ.29లక్షలకు పైగా బకాయిలు..

ఏడునెలలుగా కేంద్రాలకు అద్దె చెల్లింపులు రాకపోవడంతో ప్రభుత్వం నుంచి రూ.29.54లక్షలు అద్దె బకాయిలు ఇంటి యజమానులకు రావాల్సి ఉంది. ఈ బకాయిలు ఎప్పుడు ఇస్తారా? అని యజమానులు ఎదురు చూస్తున్నారు. ఒకటీ రెండునెలలైతే ఆగుతాం కానీ ఆరేడునెలలపాటు అద్దె చెల్లించకపోతే ఎలా అంటూ భవనాల యజమానులు అంగన్‌వాడీలను నిలదీస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి అద్దె బకాయిలను చెల్లించాలని భవనాల యజమానులు డిమాండ్ చేస్తున్నారు.

బడ్జెట్ కోసం ఎదురుచూస్తున్నాం...

అద్దె చెల్లింపులకు సంబంధించి అన్ని ప్రతిపాదనలు జిల్లా అధికారులకు పంపాం. బడ్జెట్ ఇంకా రాలేదు. వాటి కోసం ఎదురుచూస్తున్నాం. బడ్జెట్ రాగానే ఆయా అంగన్‌వాడీ కేంద్రాల భవన యజమానులకు అద్దెలు చెల్లిస్తాం.

– లక్ష్మీభార్గవి, చిల్లకల్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం : ఆర్డీఓ



రైతుల సమస్యలు వింటున్న ఆర్డీఓ బాలకృష్ణ, పక్కన తహసీల్దార్ శాంతిలక్ష్మి



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ నరసింహారావు



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జగ్గయ్యపేట ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్



మోగులూరలో రైతుల సమస్యలు వింటున్న తహసీల్దార్ జాహ్నవి

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): రైతుల భూసమస్యలు వెంటనే పరిష్కరించడమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు నందిగామ డివిజన్ ఆర్డీఓ కె.బాలకృష్ణ తెలిపారు. మండలంలోని ముండ్లపాడు పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయా భూసమస్యలను పరిష్కరించాలంటూ 15మంది రైతులు అర్జీలు అందజేశారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి అర్జీకి రశీదు ఇవ్వడంతోపాటు ఆయా అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాని సూచించారు. అనంతరం రైతుల నుంచి 15 అర్జీలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మీ, ఆర్ఐ షేక్ అబ్దుల్ హలీమ్, మండల సర్వేయర్ స్వప్న, వీఆర్వో సుధశ్రీ, రైతులు పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో..

మంగొల్లు(వత్సవాయి) : మండలంలోని మంగొల్లు గ్రామసచివాలయ ఆవరణలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ నరసింహారావు మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారం కోసమే సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయా భూసమస్యల పరిష్కారం కోరుతూ 20మంది రైతులు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ జనార్దనరావు, వీఆర్వో సుభాని, నీటి సంఘం ఉపాధ్యక్షులు మన్నె నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

ముక్త్యాల(జగ్గయ్యపేట): భూ సమస్యలపై అర్జీలు అందజేస్తే, పరిష్కరిస్తామని జగ్గయ్యపేట ఇన్‌చార్జి తహశీల్దార్ పి.మనోహర్ తెలిపారు. ముక్త్యాల గ్రామ సచివాలయంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయా భూసమస్యల పరిష్కారం కోరుతూ ఎనిమిది మంది రైతులు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఆయా అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ షేక్ హస్మతూన్‌బేగం, మండల సర్వేయర్ అనూష్‌బాబు, వీఆర్వో టి.చంద్రశేఖర్, దేవాలయ ఈవో జయప్రకాష్, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

మోగులూరు(కంచికచర్ల): భూవివాదాలకు తావులేకుండా ఆయా సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పి. జాహ్నవి తెలిపారు. మండలంలోని మోగులూరు గ్రామ సచివాలయంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూముల సర్వే నంబర్లలో కొలతలు, హద్దులు తేడాలున్నట్లయితే అర్జీలు అందజేయాలని రైతులకు సూచించారు. ఆయా భూసమస్యల పరిష్కారం కోరుతూ నాలుగు అర్జీలు అందినట్లు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మానస, ఆర్ఐ వెంకట్, వీఆర్వో వెలగా శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

జోరుగా కోడి పందేలు



జోరుగా సాగుతున్న కోడి పందేలు(ఫైల్)

- కూటమి ప్రజాప్రతినిధులే రింగ్‌లీడర్లు..
- రోజుకో చోట బరులు..కోడి పందేలు
- పందెంరాయుళ్లకు వాట్సప్‌లో లొకేషన్ సమాచారం
- పట్టించుకోని పోలీసులు

కంచికచర్ల: జిల్లాలో పందెం కోళ్లు కూటమి నేతలకు కాసులు కురిపిస్తున్నాయి. సంక్రాంతి పండుగ సమయంలో సంప్రదాయంగా నిర్వహించే కోడిపందేలు ఈసారి నెలరోజులు ముందుగానే జిల్లాలో యథేచ్ఛగా సాగుతున్నాయి. కూటమి ప్రజాప్రతినిధులు ఈ కోడి పందేలకు రింగ్‌లీడర్లు కావటంతో చేసేదేమిలేక పోలీసులు చేష్టలుడికి చూస్తున్నారు. పందెంరాయుళ్లు ఇప్పటికే వేలల్లో పందెలు కాస్తూ జేబులు గుల్ల చేసుకుంటుండగా, నిర్వాహకులు మాత్రం జేబులు నింపుకుంటున్నారు.

యథేచ్ఛగా కోడిపందేలు..

నందిగామ నియోజకవర్గంలోని కంచికచర్ల మండలం కీసరు మున్నేటి ఒడ్డున లంక భూముల్లో వారంరోజులుగా భారీగా కోడి పందేలు సాగుతున్నాయి. పరిటాల క్వారీల్లో, గనిఆత్కూరు లంక భూముల్లో, చందర్లపాడు మండలం కొడవటికల్లు, పొక్కునూరు, వీరులపాడు మండలం రంగాపురం, తిమ్మాపురం అడవిప్రాంతంలో ఈ కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. నందిగామ మండలం పెద్దవరం, జొన్నలగడ్డ తదితర గ్రామాల్లో జగ్గయ్యపేట నియోజకవర్గంలోని వత్సవాయి మండలం, పెనుగంచిప్రోలు మండలాల్లో కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. మైలవరం నియోజకవర్గంలోని జి.కొండూరు, మర్సుమల్లి గ్రామంలో కోడిపందేలకు అడ్డలేకుండాపోయింది.

ఏసీపీ సైతం తనిఖీలకే పరిమితం..

అత్యంత పకడ్బందీగా సాగుతున్న ఈ కోడిపందేలు సాగుతున్నప్పటికీ పోలీసులు కనీస దాడులు చేయడం లేదు. వేలతో మొదలయ్యే పందేలు లక్షల వరకు సాగుతుండటంతో ఇదే వ్యసనంగా కొందరు వ్యక్తులు తీవ్రంగా నష్టపోతూ కుటుంబాలను ఇబ్బందుల్లోకి నెడుతున్నారు. యథేచ్ఛగా సాగుతున్న ఈ కోడిపందేల వ్యవహారాన్ని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసుల తీరుపై డివిజన్‌లో పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పత్రికలు, టీవీల్లో కథనాలు వస్తున్నప్పటికీ పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

ఇక డివిజనల్ స్థాయి పోలీసుబాస్ సైతం ప్రస్తుతం వార్షిక తనిఖీల పేరుతో ఆయా పోలీసుస్టేషన్ల పరిశీలనకే పరిమితమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఉధృతంగా సాగుతున్న ఈ పందేలపై ఒక్క కేసు కూడా నమోదుగాకపోవడం గమనార్హం. ఇప్పటికే మద్యాన్ని ప్రధాన ఆదాయవనరుగా మార్చుకున్న కొందరు కూటమి నేతలు కొంతకాలంగా కోడిపందేలపై దృష్టి సారించి జేబులు నింపుకుంటుండగా, పందెంరాయుళ్లు మాత్రం ఈ వ్యసనం బారినపడి తీవ్రంగా నష్టపోతున్నారు. ఇకనైనా పోలీసులు స్పందించి కోడిపందేలు నిర్వహించే వారిపై కఠినచర్యలు తీసుకుని కోడిపందేలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీస్‌శాఖ ప్రతిష్ట పెంచాలి : ఏసీపీ



వీరులపాడు పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ తిలక్, పక్కన సీఐ చవాన్

వీరులపాడు: ప్రజల జీవన గమనానికి అనుగుణంగా పోలీసు సిబ్బంది ఫ్రెండ్లీ పోలీసింగ్ సేవలు విస్తృతం చేయాలని నందిగామ ఏసీపీ తిలక్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వీరులపాడు పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్క పోలీస్ అధికారి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఫిర్యాదుదారుల మానసికస్థితిని అర్థం చేసుకుని తదనుగుణంగానే కేసు విచారణ చేపట్టాలన్నారు.స్టేషన్ అధికారులు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలన్నారు. స్టేషన్ సిబ్బందిని ఏకతాటిపైకి తీసుకొచ్చి కేసులను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. స్టేషన్‌లో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. పోలీస్ శాఖపై ప్రజలకు విశ్వాసం పెరిగేలా నడుచుకోవాలని, ప్రజలకు అండగా నిలుస్తూ పోలీస్‌శాఖ ప్రతిష్టను పెంచాలని ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నందిగామ రూరల్ సీఐ చవాన్, ఎస్ఐ అనిల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన టెక్నికల్ అండ్ కల్చరల్ ఫెస్ట్





డ్యాన్స్ చేస్తున్న అమ్రితసాయి విద్యార్థులు

కంచికచర్ల: మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న టెక్నికల్ అండ్ కల్చరల్ ఫెస్ట్ ఆసిస్ట్ ఆహ్వాన్ 2కె24 గురువారంతో ముగిసింది. యాప్ డవలప్‌మెంట్స్, రోబో టిక్స్, హార్డ్‌వేర్ నమూనా, ప్రాజెక్టు మోడల్స్‌ను విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థులకు సాంకేతిక అంశాలపై పేపర్ ప్రజంటేషన్, టెక్నికల్ క్విజ్, సెమినార్ పోటీల నిర్వహించి, విజేతలకు నగదు బహుమతితోపాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కె.రామ్మోహన్‌రావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శశిధర్ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్య, స్వీయనియంత్రణ , సాంకేతిక అంశాలపై ద్వారానే ఓ విద్యార్థి అత్యుత్తమ ఇంజినీర్‌గా రాణించగలరని పేర్కొన్నారు. ఫెస్ట్ ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులు చేసిన డ్యాన్స్‌లు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పీ చిరంజీవి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం శ్రీదేవి, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలంతా కూటమి పక్షానే: ఎమ్మెల్యే



టీడీపీలో చేరిన కీసర గ్రామానికి చెందిన వారితో నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నందిగామటౌన్: రాష్ట్ర ప్రజలంతా కూటమి పక్షానే ఉన్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం కంచికచర్ల మండలం కీసర గ్రామానికి చెందిన పలు కుటుంబాలు టీడీపీలో చేరాయి. కీసర సర్పంచ్ పేరం నర్సమ్మ, పరిటాల రామకోటేశ్వరరావు, దివ్య తదితరులకు ఎమ్మెల్యే సౌమ్య పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని వివరించారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నందిగామ ఏసీపీ తిలక్



కేక్ కట్ చేస్తున్న ఎంఈఓ రవీంద్ర, ఉపాధ్యాయులు

కంచికచర్ల : క్రీస్తు అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడుచుకోవాలని నందిగామ ఏసీపీ ఏబీకే తిలక్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ బోనగిరి రాజు అధ్యక్ష్యతన గురువారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించి కేక్ కట్‌చేశారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, క్రీస్తు బోధనలు ఆచరణీయమని పేర్కొన్నారు. ఆర్సీఎం ఫాదర్ పేరందత్తు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): స్థానిక ప్రాథమిక పాఠశాలలో గురువారం సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేయడంతోపాటు ఏసుక్రీస్తు ఆచరించిన శాంతి, ప్రేమ, దయాగుణాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ డి.రవీంద్ర, హెచ్ఎం సీహెచ్ రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎస్ఎంసీ చైర్మన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


ప్రార్థనా మందిరాలు..విద్యా, ఆధ్యాత్మిక సమాహారాలు



పేటలోని సెయింట్ థామస్ సీఎస్ఐ టౌన్ చర్చి



క్రిస్టియన్‌పేట సెయింట్ ఆండ్రూస్ సీఎస్ఐ చర్చి



విలియంపేట హెర్మోను రూపాంతర సీఎస్ఐ చర్చి

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేటలో దశాబ్దాల చరిత్రగల చర్చిలు విద్యా, ఆధ్యాత్మిక సమాహారాలుగా పేరెన్నికగన్నాయి. ఇక్కడ ఉన్న సీఎస్ఐ చర్చిలు దశాబ్దాలుగా ఎంతో ఘనచరిత్రను కలిగి ఉన్నాయి. చర్చి ఆఫ్ సౌత్ ఇండియా(సీఎస్ఐ) పేరుతో 1947లో స్థాపించిన సంస్థ పూర్వం సీఎంఎస్‌గా అనగా చర్చి మిషన్ సొసైటీగా మారి చర్చిలు, ఎయిడెడ్ పాఠశాలలు ఏర్పాటు చేసి ఆధ్యాత్మికరంగంతోపాటు విద్యాభివృద్ధిలో కీలకపాత్ర పోషించింది. పట్టణంలోని క్రిస్టియన్‌పేటలో ఉన్న 175ఏళ్ల చరిత్రగల సెయింట్ ఆండ్రూస్ చర్చి 1847 నుంచి సేవలు ప్రారంభించగా, 1883లో చర్చి మిషన్ సొసైటీవారు కాలువ గట్టు ప్రాంతాన చర్చి, స్కూలును ఒకే ప్రాంగణంలో నిర్మించడానికి స్థలం కొనుగోలు చేసి పరి ఆంద్రెయ(సెయింట్ ఆండ్రూస్) చర్చి నిర్మించారు. తరువాత బిషప్‌గా రైట రెవ దైవాశీర్వాదం, పాస్టర్‌గా చార్లెస్ పిన్నీ ఉన్న సమయంలో 2012లో చర్చి పునర్నిర్మాణం చేశారు. అదేవిధంగా పట్టణంలోని పోస్టాఫీసు ఎదురుగా నిర్మించిన పరి తోమా చర్చిని(సెయింట్ థామస్ చర్చి) 1970 డిసెంబర్ 20న ప్రారంభించారు. అదేవిధంగా 2012లో రెండో అంతస్తు నిర్మించి డిసెంబర్ 20న ప్రారంభించారు.సెంట్రల్ ఏసీతోపాటు లిఫ్ట్ సౌకర్యాలు ఉన్న చర్చిల్లో జిల్లాలో రెండోవదిగా ఈ చర్చి పేరెన్నిక కలిగింది. విలియంపేటలోని హెర్మోను రూపాంతర సీఎస్ఐ చర్చికి కూడా 89ఏళ్ల చరిత్ర ఉంది. 1930–38 మధ్య అప్పటి డీనరీ చైర్మన్ రెవ హెక్టరు విలియం నేతృత్వంలో చర్చి కమ్ పాఠశాల నిర్మించారు. అందుకే ఈ ప్రాంతానికి విలియంపేటగా పేరు వచ్చింది. తదనంతరకాలంలో చర్చి శిథిలావస్థకు చేరడంతో 2004లో పునః నిర్మించారు. ఇలా జగ్గయ్యపేట పట్టణంలో సీఎస్ఐ సంస్థ ఒకవైపు ఆధ్యాత్మికంగా, మరోవైపు విద్యాపరంగా, ఇంకోకవైపు సాంఘిక సేవలో గుడిగా, బడిగా, సేవా నిలయంగా తన విశిష్ట సేవలనందిస్తోంది.

పారిశుద్ధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు : కమిషనర్



నందిగామటౌన్: పట్టణంలోని అన్నా క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పురపాలక సంఘ కమిషనర్ రమణబాబు సూచించారు. అన్నాక్యాంటీన్‌లో ఆహారపదార్థాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. పట్టణంలోని ఐదు, 13వ వార్డుల్లో గురువారం ఆయన పర్యటించారు. ఆయా ప్రాంతాల ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలతోపాటు వ్యాపారులు సైతం పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. గాంధీసెంటరులో తాగునీటి పైప్‌లైన్ మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఏఈ ఫణి శ్రీనివాస్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.